RNI NO:APTEL /2023/90201

రాజధాని

తెలుగు దినపత్రిక

వాయిస్

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును


సంపుటి : 02 | సంచిక : 343 | 03 మంగళవారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

నేడే పట్టణ ఎన్నికల ఫలితాలు..



అమరావతి, రాజధాని వాయిస్ : రాష్ట్రంలోని 92 పట్టణ స్థానిక సంస్థల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవిత వ్యం మంగళవారం తేలనుంది. ఈ నెల ఒకటిన జరిగిన ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని మొత్తం 3,186 వార్డుల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థులుగా 153 మంది, మున్సిపల్ ఛైర్మన్ పదవులకు 367 మంది, కార్పొరేటర్ స్థానాలకు 3,073 మంది, కౌన్సిలర్ స్థానాలకు 6,669 మంది పోటీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 138 కౌంటింగ్ కేంద్రాల్లో 556 హాళ్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. వీటిలో మొత్తం 6,831 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేసింది. ఓట్ల లెక్కింపునకు 47,817 మంది సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని నియమించారు.

డీఎస్సీ పూర్తిస్థాయి ప్రకటన నేడు



అమరావతి, రాజధాని వాయిస్ : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పూర్తిస్థాయి డీఎస్సీ నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేయనుంది. పోస్టుల రిజర్వేషన్ రోస్టర్‌కు సంబంధించి జిల్లా విద్యాధికారులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ ప్రక్రియ దాదాపు పూర్తయింది. అక్టోబరు 13న డీఎస్సీ ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. నవంబరు 3 లోపు పూర్తి స్థాయి నోటిఫికేషన్ జారీ చేస్తామని ఆ ప్రకటనలోనే పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. దరఖాస్తుల స్వీకరణ పదో తేదీ నుంచి చేపట్టే అవకాశం ఉంది. మొత్తం 2,721 పోస్టులకు ప్రకటన విడుదల కానుంది. ఇందులో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్తు, పురపాలక పాఠశాలల్లో 2,111, ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు 350, సొసైటీల్లో ప్రిన్సిపల్, పీజీటీ, టీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులు 260 ఉన్నాయి.

దూసుకొస్తున్న మురసు..

అమరావతి, రాజధాని వాయిస్ : మురసు తుపాను దూసుకొస్తోంది. తుపాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగాపలు జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుండి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. కృష్ణపట్నం పోర్టులో 3వ నెంబరు ప్రమాద హెచ్చరికను ఎగరవేశారు. 12 కిలోమీటర్ల వేగంతో వస్తున్న ఈ తుపాన్ మంగళవారం తెల్లవారు జామున తీరం దాటే అవకాశం ఉందని విపత్తుల నివారణ శాఖ తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

నెల్లూరు నగరంలో గాలులకు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వద్ద భారీ వృక్షం కూలి పడటంతో కారు నుజ్జునుజ్జు అయింది. ప్రకాశం జిల్లా శింగరాయకొండలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కొత్తపట్నం, శింగరాయకొండ మండలం పాకల, ఊళ్లపాలెం సముద్ర తీరం వద్ద అలల ఉధృతి తీవ్రంగా ఉంది. ఊళ్లపాలెం సముద్ర తీరంలో పడవలు సముద్రపు అలల నీటిలో తేలాడుతున్నాయి. వాటిని సురక్షితంగా ఒడ్డుకు తేవడానికి మత్స్యకారులు ప్రయత్నిస్తున్నారు. పాకల సముద్ర తీరం వద్ద అలలు భారీగా ముందుకొచ్చాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. పాలకొల్లు, ఆచంట, పెనుమంట్ర తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అర్నబ్ తుపాన్ తాకిడికి విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఇంకా పునరుద్ధరణ కాలేదు. ఈ నేపథ్యంలో మురసు తుపానుతో ఆందోళన వ్యక్తమవుతోంది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పిఎంలంక, పేరుపాలెం తీరప్రాంతాల్లో సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి.

పలాసలో 54.25 మిల్లీమీటర్ల వర్షపాతం

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట, జి.సిగడాం, సారవకోట, జలుమూరు ప్రాంతాల్లో



వర్షాలు కురుస్తున్నాయి. పలాసలో అత్యధికంగా 54.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విజయనగరం జిల్లాలో వర్షాలు పడ్డాయి. భారీ వర్షానికి విజయనగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాటిపూడి రిజర్వాయర్ కు పైనుంచి నీరు ఎక్కువగా రావడంతో రెండు గేట్లు ఎత్తివేసి నీటికి దిగువకు విడుదల చేశారు. తిరుపతి జిల్లాలో పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, ఏర్పేడు రేణిగుంట, తిరుపతి అర్బన్ రూరల్ మండలాల్లో ముసురు వర్షాలు కురుస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా దక్షిణ కోస్తా రైల్వే అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. ఇండిగో సంస్థకు చెందిన పది విమాన సర్వీసులు, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కు చెందిన రెండు సర్వీసులు రద్దయ్యాయి.

11న విజయవాడలో కొత్త పార్టీ ప్రారంభం: విజయసాయిరెడ్డి


విజయవాడ, రాజధాని వాయిస్ :: రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలకు దీటుగా మూడో ప్రత్యామ్నాయంగా కొత్త పార్టీని ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. ఈ నెల 11న విజయవాడలో పార్టీ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిపారు. తితిదే ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు ఒ.వి.రమణతో కలిసి విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో విజయసాయిరెడ్డి సోమవారం మాట్లాడారు. విజయవాడ వేదికగా ఈ నెల 11న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు పార్టీని ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేశామన్నారు. తమ పార్టీలో చేరేందుకు అన్ని జిల్లాల నుంచి చాలా మంది నేతలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని, రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉండడం బాధాకరమన్నారు. తాను ప్రారంభించబోయే పార్టీకి ఓ.వి.రమణ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతారని విజయసాయిరెడ్డి వెల్లడించారు. తాను ప్రారంభించబోయే పార్టీ ప్రారంభోత్సవానికి అన్ని మీడియా ఛానళ్లు రావాలని, తాను కొందరిని బహిష్కరించడం



లాంటివి ఏవీ చేయబోనంటూ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

రాష్ట్రానికి కేంద్ర సాయం త్వరితగతిన అందించండి

అమరావతి, రాజధాని వాయిస్ : అర్నబ్ తుపాను కారణంగా ఏపీకి తీవ్రనష్టం వాటిల్లిందని.. కేంద్రం నుంచి సత్వర సాయమం దించాలని సీఎం చంద్రబాబు కేంద్ర బృందాన్ని కోరారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,526 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఇప్పటికే కేంద్రానికి నివేదిక సమర్పించామన్నారు. తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందంతో సచివాలయం లోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం సమావేశమయ్యారు. 'తుపాను కారణంగా విద్యుత్ ఉపకరణాలు, రోడ్లు వంటివి దెబ్బతి న్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు 7 వేల మంది సిబ్బందితో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాం. పునరావాసం, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులను ఆర్టీజీఎస్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన సిఫార్సులు సమర్పించండి. కేంద్రం నుంచి సత్వర సాయమందితేనే రాష్ట్రానికి ఊరట కలుగుతుంది' అని సీఎం తెలిపారు. కోనసీమ, పశ్చిమగోదావరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పర్యటనలో పరిశీలించిన అంశాలను బృందం సభ్యులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వరి, కొబ్బరి, అరటి తదితర పంటలకు తీవ్రనష్టం జరిగిందని ప్రస్తావించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ప్రభుత్వం వేగంగా స్పందిస్తోందని ప్రశంసించారు.



కరవు.. తుపాన్లతో ఇబ్బందులు

వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలూ దెబ్బతిన్నాయని సీఎం తెలిపారు. 'మత్స్యకారుల పడవలకు నష్టం వాటిల్లింది. అర్నబ్ తుపాను నుంచి కోలుకోకముందే మురసు తుపాను రాష్ట్రాన్ని తాకుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకప్రాంతంలో ఎల్‌నినో ప్రభావంతో కరవు పరిస్థితులు నెలకొంటే.. మరోప్రాంతంలో తుపాన్ల కారణంగా నష్టపోవాల్సి వస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించి తుపాను సమయంలో ప్రాణనష్టాన్ని భారీగా తగ్గించగలిగాం' అని చెప్పారు. ప్రాణనష్టాన్ని తగ్గించటంలో ఆర్టీజీఎస్, మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ కీలకపాత్ర పోషించాయని కేంద్ర బృందం అభిప్రాయపడింది. ఏపీ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాలకు సిఫార్సు చేస్తామని తెలిపింది.

మురసు తుపానుపై అప్రమత్తంగా ఉండాలి!

విజయవాడ, రాజధాని వాయిస్ : అర్నబ్ తుపాను ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే మురసు తుపాను ముప్పు పొంచి ఉండటంతో యంత్రాం గం అప్రమత్తంగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి, మార్కాపురం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను తొలుత బాపట్ల, మచిలీపట్నం మధ్య తీరం దాటుతుందని అంచనా వేయగా, ప్రస్తుత దిశ మార్చుకుని నెల్లూరు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అధికారులు వివరించారు. సోమవారం మధ్యాహ్నం తీరాన్ని తాకే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని, అత్యంత భారీ వర్షాలతో పాటు ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని, ముందస్తు సహాయక చర్యల కోసం ఆరు జాతీయ విపత్తు స్పందన దళం, ఏడు రాష్ట్ర విపత్తు స్పందన దళం బృందాలను సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల సిబ్బంది పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలకు గ్రామీణ రహదారులు దెబ్బతిన్నా, చెట్లు కూలి రాకపోకలకు ఆటంకం కలిగినా వెంట నే స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను నిరంతరం పరిశీలించాలని, ఉద్ధృతంగా ప్రవహించే ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,



నష్టం సంభవించిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకర రహదారులు, లోతట్టు కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వర్షాలు తగ్గిన వెంటనే బ్లీచింగ్, క్లోరినేషన్ చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తీర ప్రాంత మత్స్యకారులు సముద్రంలో అలజడి పూర్తిగా తగ్గి, అధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వేటకు వెళ్లకుండా చూడాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రజలు బీచ్‌లకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు పంటల రక్షణపై ముందస్తు సూచనలు అందించాలని ఆదేశించారు. భారీ వర్షాలతో పంటలు నీట మునిగిన ప్రాంతాల్లో నీటిని త్వరగా బయటకు మళ్లించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి వెలువడే హెచ్చరికలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేవరకు ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు కర్ణాటక సహకారం



బెంగళూరు : అర్నబ్ తుపానుతో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న మౌలిక వసతులకు మరమ్మతులు చేపట్టేందుకు తమ వంతు సహకారం అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం ముందుకొచ్చింది. విద్యుత్తు సదుపాయాల పునరుద్ధరణకు మానవ వనరులు, ఉపకరణాలు అందించాలని ఏపీ ప్రభుత్వం కోరిందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబుతో తాను ఫోన్‌లో మాట్లాడి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య సహకారం, ఐకమత్యాన్ని కోరుకుంటూ కర్ణాటక విద్యుత్తుశాఖ మంత్రి కేజే జార్జ్ నేతృత్వంలో 500 మంది లైన్‌మెన్లు, క్రేన్లు, ఎర్త్ ఆగర్ల పాల్గింగర్ లారీలు-15, ట్రాక్టర్ ఆధారిత డ్రిల్లింగ్ యంత్రాలు-25 పంపిస్తున్నామని వెల్లడించారు. ఈ బృందం సోమవారం మధ్యాహ్నమే ఏపీకి తరలివెళ్లిందని తెలిపారు. సిబ్బంది ప్రయాణం, ఇతర ఖర్చులను కర్ణాటక ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

ఏపీలో సహాయక చర్యలకు తమిళనాడు సిబ్బంది

తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వ్యవస్థల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు 500 మంది సిబ్బందిని తమిళనాడు ప్రభుత్వం పంపింది. సిబ్బందిని, యంత్రాలను పంపాలంటూ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ఫోన్ ద్వారా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ మేరకు సీఎం ఆదేశాలతో తొలి విడతగా 500 మందిని పంపినట్లు విద్యుత్తుశాఖ మంత్రి నిర్మల్‌కుమార్ తెలిపారు. ఏపీలో సహాయక, పునరావాస కార్యకలాపాల కోసం ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన మూడు బృందాలు అరక్కోణం నుంచి ఆంధ్రప్రదేశ్ బయల్దేరాయి. ఒక్కో బృందంలో 30 మంది చొప్పున మొత్తం 90 మంది ఉన్నారు.

బీసీలకు పదవులు దక్కడం జగన్‌కు ఇష్టం లేదు: మంత్రి అనగాని

అమరావతి, రాజధాని వాయిస్ : బీసీలకు రాజ్యాధికారం దక్కడం వైకాపా అధినేత జగన్‌కు ఇష్టం లేదని, అందుకే స్థానిక ఎన్నికల్ని అడ్డుకోవడానికి ఆయన కుట్రలు పన్నుతున్నారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి పక్షాలు 50 శాతానికి పైగా రిజర్వేష న్లు కల్పించినట్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 'మేయర్ స్థానాల్లో 53.85 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 41.56 శాతం, నగర పంచాయతీల్లో 60 శాతం బీసీలకు కేటాయించాం. వెనకబడిన తరగతులకు కేవలం హామీలివ్వడం కాదు. వాటిని అమలు చేసి చూపిస్తున్నాం' అని సత్యప్రసాద్ తెలిపారు.



మెరుగవుతున్న గోపిక ఆరోగ్యం

అమరావతి, రాజధాని వాయిస్ : అనంతపురం జిల్లా రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి, బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగవుతోందని వైద్యఆరోగ్య శాఖ వెల్లడించింది. రక్తపోటు అదుపులోకి వచ్చిందని, మూత్ర విసర్జన వ్యవస్థ మెరుగుపడిందని తెలిపింది. మూత్రపిండాల పనితీరు సాధారణ స్థాయిలో ఉన్నట్లు సోమవారం వైద్యులు వెల్లడించిట్లు పేర్కొంది. బెంగళూరులో గోపికకు చికిత్స అందిస్తున్న వైద్యులు మయూర్ శెట్టి, లాల్‌చంద్, శిజ్జు, కౌశిక్, రవికిరణ్‌లతో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. వైద్యుల కృషిని అభినందించారు. ఘటన జరిగాక బాలికకు తక్షణ చికిత్స అందించడంలో వేగంగా స్పందించిన అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి తదితరులను మంత్రి అభినందించారు. విధుల నిర్వహణలో వారు చూపిన చొరవను గుర్తిస్తూ డీఎంఈ ఎ.విష్ణువర్ధన్ ప్రశంస లేఖలు పంపించారు.

గోపికకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ తరఫున తక్షణ అవసరాల కింద రూ.2 లక్షలను మణిపాల్ ఆసుపత్రి యాజమాన్యానికి చెల్లించారు. మంత్రి సత్యకుమార్ తన వ్యక్తిగత ఆర్థిక సాయం కింద గోపిక కుటుంబానికి రూ.లక్ష అందించారు.

చికిత్సకు స్పందిస్తోంది..

'గోపికకు ఇప్పటివరకూ వెంటిలేటర్‌పై చికిత్సను కొనసాగించాం. మునుపటితో పోలిస్తే సోమవారం రక్తప్రసరణ మెరుగుపడింది' అని బెంగళూరు ఆసుపత్రి వైద్యురాలు భావన తెలిపారు. గోపిక గాయాలను ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ వైద్యులు మంగళవారం పరిశీలిస్తారని, శస్త్రచికిత్సలు చేశాక ఆమెను పీఐసీయూకు తరలిస్తామని చెప్పారు. చికిత్సకు గోపిక సానుకూలంగా స్పందిస్తోందని తెలిపారు.

ఉన్మాదికి ఆగిన శస్త్రచికిత్స

పోలీసు కాల్పుల్లో గాయపడిన ఉన్మాది హేమంత్‌కు అనంతపురం ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాళ్లలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో తీవ్ర రక్తస్రావమైంది. సీటీ స్కాన్ చేయించగా కాళ్లలో బుల్లెట్లు కనిపించలేదు. అవి బయటకు వెళ్లాయా లేదా అనే విషయం శస్త్రచికిత్స చేస్తే తెలుస్తుందని వైద్యులు చెప్పారు. కుడి కాలి కింది భాగానికి రక్తప్రసరణ నిలిచిపోవడంతో కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. శస్త్రచికిత్స చేయాలంటే మత్తు ఇవ్వాలి. అందుకు నిందితుడి శరీరం సహకరించడం లేదు. బీపీ, పల్స్ తక్కువగా ఉన్నాయి. ఆర్థో, సర్జికల్, అనస్తీషియా వైద్యుల బృందం పర్యవేక్షిస్తోంది. పరిస్థితిని బట్టి సోమవారం రాత్రి కానీ మంగళవారం కానీ శస్త్రచికిత్స చేస్తారని సూపరింటెండెంట్ మల్లీశ్వరి వెల్లడించారు.

లక్ష్మికి శస్త్రచికిత్స విజయవంతం

ఉన్మాది చేతిలో గాయపడి అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో విద్యార్థిని లక్ష్మికి సోమవారం ఆర్థోవిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ మహమ్మద్



గౌస్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. దాడిలో లక్ష్మి కుడికాలి పాదానికి లోతైన గాయమైంది. వేళ్ల కదలికలకు సంబంధించి మూడు కండరాలు తెగిపోయాయి. బొటనవేలు ఎముక స్థానభ్రంశం(డిస్‌లోకేషన్) అయింది. తెగిపోయిన కండరాలకు శస్త్రచికిత్స చేసి, బొటనవేలిని సరిచేసి కట్టుకట్టారు.

'నా స్నేహితురాలు గోపికపై దాడి చేసిన నిందితుడిని పోలీసులు కాల్చి, అక్కడే పాతేయాల్సింది. ఉన్మాదిని ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించకూడదు.. చంపేయాలి. వాడికి కచ్చితంగా శిక్షపడాలి' అని విలేకర్లతో మాట్లాడుతూ లక్ష్మి చెప్పింది.

దాడి ఘటన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర భయాందోళనలకు దారితీసింది. రాప్తాడు ఉన్నత పాఠశాలలో 380 మంది విద్యార్థులు ఉండగా, సోమవారం 20 మందే తరగతులకు హాజరయ్యారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధికారులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

ఊరటనిచ్చే శుభవార్త: లోకేశ్

గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని, ఈ సమాచారం తనతో పాటు, విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్న ప్రతి ఒక్కరికీ ఎంతో ఊరటనిచ్చే శుభవార్త అని ఎక్స్ వేదికగా విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'గోపిక పూర్తిగా కోలుకుని చిరునవ్వులతో మన ముందుకు రావాలి' అని ఆకాంక్షించారు. ఏ చిన్నారీ తరగతి గదిలో భయపడే పరిస్థితి రాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని మంత్రి తెలిపారు. దాడి చేస్తున్న ఉన్మాదిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన లక్ష్మి ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శమని కొనియాడారు. నిజమైన స్నేహానికి, అసలైన ధైర్యానికి ఆమె నిదర్శనమన్నారు.

తితిదేకు స్పెసిఫైడ్ అథారిటీ నియామకం

తిరుపతి: తితిదే ట్రస్టు బోర్డు పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం 'స్పెసిఫైడ్ అథారిటీ'ని నియమి ంచింది. ఈ మేరకు జీవో నం. 658 విడుదల చేసింది. తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర ఛైర్మన్‌గా.. ఆర్థికశాఖ కార్యదర్శి వి. వినయ్ చంద్, దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు సభ్యులుగా అథారిటీని ఏర్పాటు చేసింది. నూతన ట్రస్ట్ బోర్డు ఏర్పాటయ్యే వరకు లేదా ఏడాది పాటు ఈ స్పెసిఫైడ్ అథారిటీ కొనసాగనుంది. తితిదే ధర్మకర్తల మండలికి ఉండే అన్ని అధికారాలూ దీనికి ఉంటాయి.

ములగలమ్మ తల్లికి మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు!

సూరవరం, నవంబర్ 2 : ఎన్టీఆర్ జిల్లా ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో ములగలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి గ్రామంలోని అమ్మవారి ఆలయాన్ని సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి పూజలు సమర్పించి రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ప్రతి కుటుంబంలో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లో సంతోషం, శాంతి నెలకొనాలని అమ్మవారిని వేడుకున్నారు.ప్రత్యేకంగా రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. రైతులకు ఈ ఏడాది సమృద్ధిగా పంటలు పండాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ప్రకృతి అనుకూలించి పంటలు ఆశాజనకంగా చేతికందాలని, రైతు కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం ఏర్పడాలని అమ్మవారిని ప్రార్థించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా ప్రజలు తమ కుటుంబాల క్షేమం, గ్రామాభివృద్ధి, పాడిపంటల సమృద్ధిని ఆకాంక్షిస్తుంటారు. ఈ నేపథ్యంలో సూరవరం గ్రామంలోని ములగలమ్మ తల్లి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. రైతులు సంతోషంగా ఉండాలని, గ్రామాల్లో అభివృద్ధి, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ప్రార్థించారు

మున్సిపల్ కౌంటింగ్‌కు మూడంచెల భద్రత!

- పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు: ఎస్పీ తుహిన్ సిన్హా
- ఎలమంచిలి, నర్సీపట్నంలో ప్రత్యేక పోలీసు నిఘా
- డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- అనుమతి పత్రాలు ఉన్నవారికే కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశం

అనకాపల్లి, రాజధాని వాయిస్ : అనకాపల్లి జిల్లా పరిధిలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మూడంచెల పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లాలోని జీవీఎంసీ తొమ్మిది వార్డులు, అనకాపల్లి, పరవాడ, సబ్బవరం ప్రాంతాలతోపాటు ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ ప్రజలు, అధికారుల సహకారంతో ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు. నవంబర్ 3న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎలమంచిలిలోని గుర్రప్ప కల్యాణ మండపం కౌంటింగ్ కేంద్రం వద్ద పరవాడ డీఎస్పీ బి. మోహనరావు పర్యవేక్షణలో, ఎలమంచిలి సీఐ ఎస్. ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నర్సీపట్నంలోని పెద్దబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో, పట్టణ సీఐ షేక్ గఫూర్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిరంతరం సాయుధ పోలీసు బలగాలు పహారా కాస్తాయని ఎస్పీ వివరించారు.భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఉన్నత సామర్థ్యం గల నిఘా కెమెరాలు, డ్రోన్లను వినియోగించనున్నారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డులు కలిగిన అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, ఓట్ల లెక్కింపు ఏజెంట్లకు మాత్రమే నిర్దేశిత సమయంలో ప్రవేశం కల్పిస్తారు. అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించరు. కౌంటింగ్ కేంద్రాల్లోకి చరవాణులు, కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, నిప్పుపెట్టెలు తీసుకెళ్లడంపై నిషేధం విధించారు.కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయనున్నారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. కేంద్రాల చుట్టుపక్కల నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని, ప్రజలు గుంపులుగా గుమిగూడటం, అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం నిషేధమని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఓట్ల లెక్కింపు సమయంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, ధ్రువీకరించని వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు.

సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులు క్షేమం : కలెక్టర్ హిమాన్ష్ శుక్ల

మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారుల సమన్వయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరిన బోటు
రక్షణ చర్యల్లో అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులు, మత్స్యకారులను ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల



నెల్లూరు, రాజధాని వాయిస్ : కావలి నియోజకవర్గం జువ్వలదిన్నె సమీప సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు ఇంజన్ చెడిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల తెలిపారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో అప్రమత్తంగా చేపట్టిన రక్షణ చర్యలతో బోటును సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో పాటు అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా రక్షించినట్లు వెల్లడించారు.జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు నెల్లూరు సముద్ర తీర ప్రాంతానికి చేరుకున్న సమయంలో సముద్రంలో వాతావరణ మార్పులను గమనించి తిరిగి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలో బోటు ఇంజన్ చెడిపోవడంతో హార్బర్ మౌత్ పాయింట్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో సముద్రంలోనే నిలిచిపోయారు.ఈ విషయాన్ని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో విధులు నిర్వహిస్తున్న సర్వెలెన్స్ సిబ్బంది గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై స్థానిక మత్స్యకారుల సహకారంతో రక్షణ చర్యలు ప్రారంభించారు. సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉండటంతో తొలుత బోటు వద్దకు చేరుకోవడం కష్టతరమైంది.ఈ క్రమంలో బోటుకు వేసిన లంగరు తెగిపోవడంతో సముద్ర అలల ఉధృతికి బోటు పాతకడపాలెం గ్రామం వైపు కొట్టుకుపోయింది. వెంటనే అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో బోటును అనుసరిస్తూ రక్షణ చర్యలను కొనసాగించారు. చివరకు బోటును పాతకడపాలెం సముద్ర తీరానికి సురక్షితంగా చేర్చి అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు తీసుకువచ్చారు.ఈ రక్షణ చర్యల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, సర్వెలెన్స్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

హేమంత్‌కు శస్త్రచికిత్స.. మూడు బుల్లెట్లు తొలగింపు!

- రాత్రివేళ అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహణ
- తీవ్ర రక్తస్రావంతో నాలుగు రక్తపు బాటిళ్లు ఎక్కింపు
- ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స
- ప్రత్యేక భద్రత మధ్య కొనసాగుతున్న వైద్య సేవలు

అనంతపురం,రాజధాని వాయిస్ : రాప్తాడు ఘటనలో నిందితుడిగా ఉన్న హేమంత్‌కు వైద్యులు రాత్రివేళ అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించారు. కాల్పుల్లో గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరిస్థితిని పరిశీలించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో శరీరంలోకి చొచ్చుకెళ్లిన మూడు తూటాలను వైద్యులు విజయవంతంగా తొలగించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి చేరుకున్న హేమంత్‌కు తక్షణ వైద్యసేవలు అందించడంతో పాటు ప్రాణాపాయం తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాల్పుల కారణంగా హేమంత్ శరీరం నుంచి అధికంగా రక్తస్రావం జరిగినట్లు వైద్యులు వెల్లడించారు. దీంతో అతడికి నాలుగు రక్తపు బాటిళ్లు ఎక్కించినట్లు తెలిపారు. శస్త్రచికిత్సకు ముందు, అనంతరం అతడి ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం నిశితంగా పరిశీలించింది. రక్తస్రావాన్ని నియంత్రించడంతో పాటు శరీరంలోని తూటాలను తొలగించడం ప్రధాన లక్ష్యంగా వైద్యులు చికిత్స కొనసాగించారు. అత్యవసర పరిస్థితుల్లో అందించిన వైద్యసేవలు ఫలించడంతో ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.శస్త్రచికిత్స పూర్తయిన అనంతరం హేమంత్‌ను ఆసుపత్రిలోని ఏఎంసీ వార్డుకు తరలించారు. అక్కడ ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం శరీరంలో తలెత్తే మార్పులు, రక్తపోటు, రక్తస్రావం వంటి అంశాలను వైద్యులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అవసరమైన మందులు అందిస్తూ కోలుకునే వరకు నిరంతర పర్యవేక్షణలో ఉంచినట్లు సమాచారం. ప్రస్తుతం అతడికి మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రి వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.మరోవైపు, ఈ ఘటనకు



సంబంధించిన పరిణామాల నేపథ్యంలో ఆసుపత్రిలో హేమంత్‌కు ప్రత్యేక భద్రత కల్పించారు. చికిత్స పొందుతున్న వార్డు వద్ద భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వైద్యసేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, అదే సమయంలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. హేమంత్‌ను కలిసేందుకు వచ్చే వ్యక్తుల విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. వైద్యుల పర్యవేక్షణతో పాటు భద్రతా సిబ్బంది నిఘా కొనసాగుతోంది.ప్రస్తుతం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో హేమంత్‌కు చికిత్స కొనసాగుతోంది. మూడు తూటాలను తొలగించడం, తీవ్ర రక్తస్రావాన్ని నియంత్రించడం వైద్య చికిత్సలో కీలక పరిణామాలుగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో కోలుకునేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. వైద్యుల పర్యవేక్షణలో తదుపరి చికిత్స కొనసాగనుంది. రాప్తాడు ఘటన అనంతర పరిణామాలపై ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో హేమంత్ ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు సంబంధించిన తాజా వివరాలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

ఎన్నికల బరిలో సినీ హాస్యనటులు.. కూటమికి మద్దతుగా ప్రచారం!

ఎల్.ఎన్.పేట, రాజధాని వాయిస్ : ఎల్.ఎన్.పేట మండలంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా సినీ హాస్యనటులు హైపర్ ఆది, షకలక శంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థుల తరఫున ప్రజలను కలుసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమానికి స్థానికంగా రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ప్రచారంలో పాల్గొనడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా హైపర్ ఆది, షకలక శంకర్ కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన, తెలుగుదేశం పార్టీల మధ్య ఉన్న ఐక్యతను క్షేత్రస్థాయిలోనూ కొనసాగించాలని సూచించారు. కూటమి లక్ష్యాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జనసేన, తెలుగుదేశం పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు స్పష్టం చేశారు. ఒకరి అభ్యర్థికి మరొకరు మద్దతుగా నిలుస్తూ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఎన్నికల సమయంలో పార్టీల మధ్య విభేదాలకు తావివ్వకుండా ఐక్యతను చాటాలని సూచించారు.కూటమి ధర్మాన్ని పాటించడం ద్వారా ఎన్నికల ప్రచారంలో సమన్వయం మరింత బలపడుతుందని నటులు అభిప్రాయపడ్డారు. జనసేన, తెలుగుదేశం శ్రేణులు ఒకే లక్ష్యంతో పనిచేస్తే అభ్యర్థులకు మద్దతు మరింత విస్తృతమవుతుందని పేర్కొన్నారు. స్థానిక నాయకత్వం, కార్యకర్తలు సమష్టిగా ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



ఎల్.ఎన్.పేట మండలంలో నిర్వహించిన ఈ ప్రచారంలో సినీ నటులు హైపర్ ఆది, షకలక శంకర్ కూటమి అభ్యర్థులకు మద్దతుగా తమ వాణిని వినిపించారు. జనసేన, తెలుగుదేశం పార్టీల మధ్య ఐక్యత, పరస్పర సమన్వయం ఎన్నికల ప్రచారంలో కీలకమని మరోసారి స్పష్టం చేశారు. అయితే ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థుల పేర్లు, పర్యటించిన గ్రామాల వివరాలు ప్రకటనలో వెల్లడించలేదు.

మురసు తుపానుపై అప్రమత్తం.. ప్రజలకు కలెక్టర్ హెచ్చరిక!



గుంటూరు, రాజధాని వాయిస్ : మురసు తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో తుపాను పరిస్థితులు, అధికార యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. తుపాను ప్రభావం ఉన్న సమయంలో ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో రానున్న రెండు రోజుల పాటు వర్షాలు, ఈదురుగాలులు నమోదయ్యే అవకాశం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలైన తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నదులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. వర్షాల సమయంలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున జలవనరుల సమీపంలో సంచరించకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.పిల్లలను బయటకు పంపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, గోడల సమీపంలో ప్రజలు ఉండరాదని హెచ్చరించారు. ఈదురుగాలుల సమయంలో చెట్లు, విద్యుత్తు స్తంభాలు, ప్రమాదకర నిర్మాణాల కింద ఆశ్రయం పొందకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను సమయంలో అనవసర ప్రయాణాలు తగ్గించుకోవాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.రైతులు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సూచించే జాగ్రత్తలను అనుసరించాలని కలెక్టర్ తెలిపారు. పంటలు, వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువులను చెట్ల కింద కట్టరాదని, సురక్షితమైన ప్రదేశాల్లో ఉంచాలని కోరారు. వర్షాలు, గాలుల ప్రభావంతో పంటలకు, పశువులకు నష్టం వాటిల్లకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధికారులు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే మండల, రెవెన్యూ డివిజనల్ అధికారి, పోలీసు, కలెక్టరేట్ నియంత్రణ కేంద్రాలను సంప్రదించి సహాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

అంగులూరులో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ!

గుడ్లవల్లేరు, రాజధాని వాయిస్ : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం అంగులూరు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 60 బీసీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ మెరుగుమాల బాలు నేతృత్వంలో ఆయా కుటుంబాల సభ్యులు పార్టీ మారారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. నూతనంగా పార్టీలో చేరిన వారికి నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ పరిణామం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చి, గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో గ్రామస్థాయి నుంచే ప్రజాస్వామ్య విధానాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి, ప్రజల సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఒకే కుటుంబంలా కలిసికట్టుగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో పాటు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభివృద్ధి దృక్పథం నచ్చి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు మెరుగుమాల బాలు తెలిపారు. ముఖ్యంగా రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఎమ్మెల్యే రాము వారికి అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రైతుల సమస్యలపై స్పందిస్తూ వారికి సహకారం అందిస్తున్న తీరు తమను ఆకర్షించిందని పేర్కొన్నారు. గ్రామంలో మరింత అభివృద్ధి జరగాలనే ఆకాంక్షతో తమ అనుచరులు, బీసీ కుటుంబాలతో కలిసి పార్టీలో చేరినట్లు వెల్లడించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో



కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య పిలుపునిచ్చారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ గుడ్లవల్లేరు మండల జనసేన జప్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకృష్ణతోపాటు కూటమి తరపున పోటీ చేస్తున్న ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.అంగులూరులో 60 బీసీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం స్థానికంగా పార్టీ బలాన్ని పెంచుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజల మద్దతుతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కొత్తగా చేరిన కుటుంబాలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ, వారి అభిప్రాయాలు, సమస్యలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలు కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

ఆదోని కౌంటింగ్‌కు పటిష్ఠ భద్రత

- 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు
- కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్
- విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి నిరాకరణ



ఆదోని, రాజధాని వాయిస్ : ఆదోని మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందు కు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం మొత్తం 350 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన నిఘా ఉంచడంతో పాటు, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నిబంధనలు పాటిం చేలా చర్యలు చేపట్టారు. ఎన్నికల ఫలితాల సమయంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలోని ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పరిసర ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ, బందోబస్తు విధులపై సమీక్షించారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశాన్ని నిశితంగా గమనించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కేంద్రంలోకి అనుమతి ఉన్నవారిని మాత్రమే పంపించాలని, అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా బారికేడ్లు, భద్రతా వలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విధులు నిర్వహిం చే పోలీసులు సమన్వయంతో పనిచేయాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. విజయం సాధించిన అభ్యర్థులు, వారి అనుచరులు బహిర ంగ ప్రదర్శనలు నిర్వహించరాదని సూచించారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాజకీయ వర్గాల మధ్య ఘర్షణలు, వాగ్వాదాలు చోటుచేసుకోకుం డా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి ర్యాలీలు, ఊరేగింపు లు నిర్వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఆదోనిలో భద్రతా ఏర్పాట్లు కొనసాగనున్నాయి. 350 మంది పోలీసులతో చేపట్టిన బందోబస్తులో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతర పర్యవేక్షణ, పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించను న్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని, ఎన్నికల ఫలితాల అనంతరం శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

గుంటూరు కార్పొరేషన్ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం కమిషనర్

గుంటూరు, రాజధాని వాయిస్ : గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం. ఓట్ల లెక్కింపుకు 50 హాల్స్ లో 468 టేబుల్స్ ఏర్పాటు ఓట్ల లెక్కింపుకి 1404 మంది సిబ్బంది నియామకం లెక్కింపు కేంద్రంలో బందోబస్తు లో భాగంగా లోనికి మొబైల్ ఫోన్ లకు అనుమతి లేదు. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు వేగంగా జరగడానికి సహకరించాలని కోరిన కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ మయూర్ అశోక్. ఈనెల 3వ తేదీన (మంగళవారం) గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా మరియు అత్యంత సజావుగా పూర్తి చేయడానికి నగర పాలక సంస్థ తరపున అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కాలేజీ నిర్దేశిత బ్లాకులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్ లను పరిశీలించి, సదరు ప్రాంతంలో జరుగుతున్న కౌంటింగ్ సిబ్బంది శిక్షణలో జిల్లా ఎన్నికల పరిశీలకులు వి.వీర బ్రహ్మయ్యతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని మొత్తం 76 వార్డుల పరిధిలో ఉన్న 596 పోలింగ్ స్టేషన్లలో నమోదైన ఓట్లను సకాలంలో లెక్కించేందుకు గాను విస్తృతమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇందుకోసం 468 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేయగా, ఈ బాధ్యతలను నిర్వహించడానికి 1,404 మంది శిక్షణ పొందిన సిబ్బందిని మరియు అధికారులను విధుల్లో నియమించామని తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు లేదా వారి తరపున నియమించబడిన అధికారిక ప్రతినిధులు 3వ తేదీ ఉదయం 6 గంటల సమయానికి స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు మరియు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీల్స్ తెరిచి లెక్కింపు ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, కేంద్రాల లోపలికి ఎలాంటి మొబైల్ ఫోన్లను అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే ప్రతినిధులు, సిబ్బంది తమ సెల్ ఫోన్లను భద్రపరుచుకోవడానికి వీలుగా బయట ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు సౌకర్యార్థం తాగునీరు, అల్పాహారం, భోజన వసతులతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళికి లోబడి, లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా అందరూ సహకరించాలని కోరారు.



ఎంపీటీసీ ఉప ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఆర్ఓ రవిచంద్రబాబు

దువ్వూరు, రాజధాని వాయిస్ : ఎన్నికల విధులపై సిబ్బంది పూర్తి అవగాహన, బాధ్యతాయుత దృక్పథంతో పనిచేయాలని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవిచంద్రబాబు పిలుపునిచ్చా రు. దువ్వూరు మండలంలో రెండు ఎంపీటీసీ స్థానాలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు), మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను, పోలింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నికలు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రతి శిక్షణను కొత్త విషయాలు నేర్చుకునే అవకాశంగా భావించి బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి చిన్న లోపాలకు కూడా తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, సీలింగ్ తదితర అంశాలపై కేవలం సైద్ధాంతిక అవగాహనకే పరిమితం కాకుండా, సిబ్బంది చేత స్వయంగా ప్రయోగాత్మకంగా (ప్రాక్టికల్గా) చేయించి శిక్షణ పూర్తి చేయాలని మాస్టర్ ట్రైనర్లు ఎం. రాజశేఖర్, వై. రిజ్వాన్ అలీలను ఆదేశించారు. శిక్షణ సమయంలో సిబ్బంది వ్యక్తం చేసిన సందేహాలను ట్రైనర్లు ఎప్పటికప్పుడు నివృత్తి చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా ముగిసేందుకు అన్ని విభాగాల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు హరికృష్ణ, వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సంధ్యావాణి, నరసింహ తదితరులు పాల్గొన్నారు



పేటలో ప్రజాస్వామ్యం ఖూనీ: మాజీ మంత్రి విడదల రజిని ధ్వజం

చిలకలూరిపేట,రాజధాని వాయిస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అండతో టీడీపీ శ్రేణులు కర్రలు, రాడ్లతో పోలింగ్ కేంద్రాలపై పడి బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, మహిళా ఏజెంట్లపై దాష్టీకాలకు దిగినా పోలీసులు వారికే కొమ్ముకాశారని ఆమె మండిపడ్డారు. నామినేషన్ల అడ్డంకులు, విపక్ష నేతలపై లాఠీఛార్జీలు, మీడియా ప్రతినిధులపై దాడులతో భయోత్పాతం సృష్టించారని ధ్వజమెత్తారు. ఈ అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, నిందితులపై చర్యలు తీసుకుని రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ, ఎన్ని బెదిరింపులు ఎదురైనా రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రజాపక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



తన పనితీరుతో భాస్కర నారాయణ సి.ఆర్.మీడియా అకాడమీ కార్యక్రమాలు విజయవంతం

విజయవాడ, రాజధాని వాయిస్ : అక్టోబర్ 31 న డిప్యూటీ డైరెక్టర్ హోదాలో అకాడమీ మేనేజర్ గా పదవీ విరమణ చేసిన మేడపాటి భాస్కర నారాయణ ను సమాచార శాఖ ఉన్నతాధికారు లు, సిబ్బంది,విశ్రాంత అధికారులు,బంధు మిత్రుల సమక్షంలో సోమవారం (02.11.26) అకాడమీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,భాస్కర నారాయణ పనితీరు పట్ల ఆయన పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.మృదు స్వభావంతో అకాడమీ అధికారులను సమన్వయంతో ముందుకు నడిపించే గలిగారన్నారు.పని పట్ల పూర్తి ఏకాగ్రత, అధికారుల పట్ల విధేయత ఆయన బలమని చైర్మన్ అభిప్రాయ పడ్డారు. ఉద్యోగిగా నిరంతరం శ్రమించే వ్యక్తి కి రిటైర్మెంట్ ద్వారా ఏర్పడిన ఖాళి ని ఎదుర్కోవడం సవాలు వంటిదే అని,భాస్కర నారాయణ తమ విశ్రాంత జీవనాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు.సి.ఆర్.మీడియా అకాడమీ తరపున భాస్కర నారాయణ ను చైర్మన్ సన్మానించారు.విశిష్ట అతిథిగా హాజరైన జాయింట్ కమీషనర్ స్టేట్ టాక్స్ మేడపాటి సత్య ప్రకాష్ మాట్లాడుతూ, భాస్కర నారాయణ మృదు స్వభావి అన్నారు.పూర్తి క్రమశిక్షణతో తనకు అప్పగించిన పనిని చేయడం ద్వారా సమాచార శాఖ అధికారుల మెప్పును పొందగలగడం ఆయన పని తీరుకు నిదర్శనమన్నారు. ప్రస్తుత రోజుల్లో ఇంత మంది అభిమానాన్ని చూరగొని ప్రశాంతంగా రిటైర్ కావడం ఆయనకు దైవమిచ్చిన వరమని అన్నారు. విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ ఎల్. స్వర్ణలత మాట్లాడుతూ, సమాచార శాఖలో అప్పగించిన పనిని సమర్థవంతంగా భాస్కరనారాయణ నెరవేర్చేవారన్నారు. క్రమశిక్షణ కలిగిన అధికారిగా ఆ శాఖలో పేరు పొందారన్నారు. మరొక విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ వివిధ హోదాల్లో భాస్కర నారాయణ సమాచార శాఖ పేరు ప్రతిష్టలు పెంచేలా పని చేశారన్నారు.ఆయన రిటైర్మెంట్ జీవితం ప్రశాంతంగా గడవాలని ఆకాంక్షించారు.సమాచార శాఖ లో తన 33 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్ సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాలను చిత్త శుద్ధితో అమలు చేశానని డిప్యూటీ డైరెక్టర్ సి.ఆర్. మీడియా అకాడమీ మేనేజర్ ఎం. భాస్కర నారాయణ అన్నారు.పౌర సంబంధాల శాఖ లో పని చేయడం,జిల్లా స్థాయిలో కలెక్టర్ వంటి ఉన్నత అధికారులతో సన్నిహితంగా పనిచేయడం తమకు అత్యంత సంతృప్తినిచ్చిందని ఆయన అన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగి గా బాధ్యతలు చేపట్టిన నాడే స్పష్టంగా నిర్ణయించ బడుతుందని, అయినా రిటైర్మెంట్ కొంత బాధగానే ఉంటుందన్నారు.తన పట్ల ప్రేమాభిమానాలతో వచ్చి,తన గురించి మంచి మాటలు చెప్పి, సన్మానించిన అధికారులకు, సిబ్బందికి,ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్లు షేక్ మహమ్మద్ బాషా, ఐ.సూర్య చంద్ర రావు, పి.తిమ్మప్ప లు భాస్కర నారాయణ పని తీరు ను ప్రశంసించారు.సమాచార శాఖ అక్కౌంట్స్ అధికారిణి రజియా బేగం,జె. ఈ. ఓ నాగరాజు, గుంటూరు డి.డి.ఎల్. రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, కె.నారాయణ రెడ్డి, తిరుపాల్, మోహన రావు,వీరభద్ర రావు, ఎన్.టి.ఆర్ జిల్లా డి.పి.ఆర్.ఓ. టి. నాగేశ్వర రావు, డి.ఐ.పి.ఆర్.ఓ. రమణ దివిజనల్ పి.ఆర్.ఓ. రవి, ఏ.వి.ఎస్. వి.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



"సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్" సత్కారం:
"సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్" తరపున విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ లు ఎల్.స్వర్ణలత, పి.కిరణ్ కుమార్, ట్రెజరర్ ఎస్. శ్రీనివాస జీవన్, జి. వెంకటేశ్వర రావులు భాస్కర నారాయణను సన్మానించారు.

జడ్పీటీసీ ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా



నకరికల్లు.నవంబరు 2, రాజధాని వాయిస్ : మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట లక్ష్మి సరోజ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నకరికల్లు గ్రామంలో భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు.సరోజ కు మద్దతుగా తెలుగు దేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ మంత్రి సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ టిడిపి రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి నాగోతు శౌరయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కోటి అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వివిధ దేవాలయాలు చర్చిలలో ప్రత్యేక పూజలు ప్రార్థనలు నిర్వహించి జడ్పిటిసి అభ్యర్థి అఖండ మెజార్టీతో గెలుపొందాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయపురి సౌత్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు



మాచర్ల.నవంబర్ 2 రాజధాని వాయిస్ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం మరియు నాటుసారా రవాణాపై ఎక్సైజ్ శాఖ నిఘా మరింత కట్టుదిట్టం చేసింది. ఇందులో భాగంగా గుంటూరు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మరియు నరసరావుపేట జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు, మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు విజయపురి సౌత్ బోర్డర్ చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా వాహనాల రాకపోవాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల వేళ సరిహద్దుల గుండా ఎలాంటి అక్రమ మద్యం, నాటుసారా రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా అక్రమ మద్య రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మాచర్ల ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎక్సైజ్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల మున్సిపల్ ఎన్నికల ఓట్లు లెక్కింపు సిబ్బందికి ర్యాండమైజేషన్ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి



బాపట్ల.నవంబర్ 02 రాజధాని వాయిస్ :బాపట్ల జిల్లాలో నవంబర్ 1 న చీరాల,రేపల్లె మున్సిపాలిటీ లకు జరిగిన ఎన్నికల ఓట్లు లెక్కింపు విధులు నిర్వర్తించే సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయింపునకు సంబంధించి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని న్యూ వి సి హాల్ నందు జిల్లాకు కేటాయించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు ఏ ఏ యల్.పద్మావతి, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్, వి., ఆధ్వర్యంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డి ఈ ఓ.శ్రీనివాస్ సింగ్,గ్రామ ,వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్ జిల్లా కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురసు తుపాను ముప్పు బాపట్ల జిల్లాలో హైఅలర్ట్

బాపట్ల. నవంబర్ 2రాజధాని వాయిస్ : మురసు తుపాను హెచ్చరికల నేపథ్యంలో బాపట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఒంగోలు--బాపట్ల మధ్య తీరం దాటి ప్రకాశం, మార్కాపురం, గుంటూరు మీదుగా తెలంగాణ వైపు కదిలే ఈ తుపానుతో భారీ వర్షాలు, రెండు మీటర్ల ఎత్తు వరకు ఉప్పెన ముప్పుంది. చినగంజాం, ఎట్టిమొగ్గ, చీరాల ఓడరేవు, అడవిపల్లెపాలెం, దిండి, కొత్తపాలెం తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పొలాల్లో నీరు నిల్వకుండా, పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సుమారు వెయ్యి విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలే అవకాశం ఉన్నందున జేసీబీలు, యంత్రాలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గిన 48 గంటల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని, ప్రజలు అనవసరంగా బయటికి రావొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

మురసు తుపాను ముప్పు అప్రమత్తంగా ఉండాలి హోంమంత్రి అనిత



అమరావతి.నవంబర్ 2రాజధాని వాయిస్ :మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తోందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగల పూడి అనిత తెలిపారు. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, తుపాను అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రానున్న 48 గంటల పాటు అధికార యంత్రాంగం హై అలర్ట్‌లో ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, సమాచార వ్యవస్థలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వెళ్లరాదని స్పష్టం చేశారు. ప్రజలు అధికారిక హెచ్చరికలు పాటిస్తూ ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని, అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 లేదా వాట్సాప్ నంబర్ 9552300009ను సంప్రదించాలని కోరారు.

మురసు తుపానును ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సర్వసన్నద్ధం మంత్రి గొట్టిపాటి



అమరావతి.నవంబర్ 2 రాజధాని వాయిస్ :మురసు తుపాను మునుపు, ఆ సమయంలో మరియు ఆ తర్వాత చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 5 వేల మందికి పైగా విద్యుత్ ఉద్యోగులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గంటకు 120 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గతరాత్రి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, మరమ్మతు పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రతి డివిజన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర సేవలందిస్తున్న ఆసుపత్రులకు ఎలాంటి అంతరాయం కలగకుండా జనరేటర్ బ్యాకప్ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సిబ్బందికి వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బంది భద్రతకు తొలి ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదని, తదితర భద్రతా సూచనలపై మీడియా మరియు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

'ఆడబిడ్డల వేదనపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు'

- రాప్తాడు ఘటనలో నిందితుడికి మద్దతుగా పిల్ వేయించారంటూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధ్వజం



గుంటూరు, రాజధాని వాయిస్ : ఆడబిడ్డల వేదనపై మాట్లాడే నైతిక హక్కు వైఎస్సార్సీపీకి లేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. రాప్తాడులో చిన్నారిపై జరిగిన ఘటన అత్యంత అమానవీయమని, ఒక మహిళగా, ఆడపిల్ల తల్లిగా ఆ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే మంత్రి నారా లోకేష్ స్పందించి, చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి మణిపాల్ ఆసుపత్రికి తరలించారని మాధవి తెలిపారు. వైద్య బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని భరోసా ఇవ్వడంతో పాటు, బాధ్యులైన పాఠశాల యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. బాధితురాలిని రాజకీయాలకు అతీతంగా ఆదుకోవడమే మానవతా దృక్పథమని అన్నారు. మరోవైపు బాధితురాలిని పరామర్శించే పేరుతో వైఎస్ జగన్ బెంగళూరు వెళ్లి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మాధవి విమర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, వైద్యుల సూచనలపై దృష్టి పెట్టకుండా బాధితురాలి కుటుంబానికి రాజకీయ రంగు పులమడం తగదన్నారు.

'నిందితుడికి అండగా పిల్ వేయించారు'

చిన్నారిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు హేమంత్‌కు మద్దతుగా వైఎస్సార్సీపీ న్యాయవాది సాల్మన్ రాజుతో హైకోర్టులో పిల్ వేయించారని మాధవి ఆరోపించారు. పోలీసులు ఆత్మరక్షణలో భాగంగా నిందితుడిపై కాల్పులు జరిపిన అంశంపై మానవ హక్కుల పేరుతో కోర్టును ఆశ్రయించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.నిజంగా బాధిత కుటుంబంపై జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం కాకుండా స్వయంగా రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని సవాల్ చేశారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు చెప్పడంతో ప్రభుత్వంపై విమర్శలు చేసే అవకాశం లేక జగన్ నిరాశకు గురయ్యాని వ్యాఖ్యానించారు.గత ప్రభుత్వ హయాంలో మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి అంశాల్లో వైసీపీ విఫలమైందని మాధవి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈగల్ బృందాలను రంగంలోకి దించి గంజాయి సాగు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు.చిన్నారులు, మహిళల భద్రత వంటి సున్నితమైన అంశాలపై రాజకీయాలు చేయడం మానుకోవాలని మాధవి సూచించారు. లేదంటే రాష్ట్రంలోని మహిళలు, తల్లులు వైఎస్సార్సీపీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కృష్ణా తీర ప్రాంత గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి

శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దు

వాగులు, వంకలు, నదులు దాటువద్దు, చేపలు పట్టుటకు వెళ్ళరాదు



గుంటూరు, రాజధాని వాయిస్ : "మురసు" తుఫాన్ ప్రభావం తో పులిచింతల నుండి ప్రకాశం బ్యారేజీకి ఎక్కువ వరద వచ్చే అవకాశం ఉందని, ఆ నీటిని కిందకు వదలడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సియం.సాయికాంత్ వర్మ తెలిపారు. ప్రకాశం బ్యారేజీ నుండి వరద వచ్చే అవకాశం ఉన్నందున మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో గల కృష్ణా తీర ప్రాంత గ్రామాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లంక గ్రామల ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమ జిల్లా మండల ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 086322340 14 ఫోన్ నంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. మండల స్థాయి కార్యాలయం వరకు కంట్రోల్ రూమ్ లు 24 గంటలు పనిచేయాలని చెప్పారు. మండలాల్లో అన్ని కోణాల్లో సమీక్షించుకోవాలని, ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, అందులో ఎవరు నివసించరాదని విజ్ఞప్తి చేశారు. చెరువులు, వాగులు, వంకల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, దాటుటకు ప్రయత్నించవద్దని కోరారు. తడిగా ఉన్న కరెంటు స్తంభాలను ముట్ట వద్దని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. 20 నుండి 30 సెంటీమీటర్లవర్షపాతం నమోదు కావచ్చని చెప్పారు. లోతట్టు ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జలవనరుల శాఖ ప్రతీ గంటకు నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ వాగు, కాలువల పర్యవేక్షణకు ఒక్కొక్కరిని నియమించాలన్నారు. పరిస్థితిని అనుసరించి తక్షణం ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పూర్తి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వివిధ వాగుల ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు. ఎక్కడైతే గట్లు బలహీనంగా ఉన్నాయో వాటిని గుర్తించాలని, అటువంటి చోట్ల ఇసుక బస్తాలు సిద్ధం వేయాలని ఆదేశించారు. గాలులకు హోర్డింగులు, చెట్లు కూలిపోయే పరిస్థితి ఉంటుందని, అర్నాబ్ తుఫాన్ లో తొలగించామని, మరోసారి తనిఖీ చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య తలెత్త రాదని అన్నారు. తాగునీటి పథకాలు వద్ద జనరేటర్లు సిద్ధంగా పెట్టుకోవాలని ఆదేశించారు. త్రాగునీరు ఎటువంటి పరిస్థితుల్లో కలుషితం కాకుండా స్పష్టమైన పర్యవేక్షణ జరగాలని అన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వలన రవాణాకు ఆటంకం జరక్కుండా ట్రీ కట్టర్స్, పవర్ సాస్ లను సిద్ధంగా పెట్టాలని రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. విపత్తు నిర్వహణ శాఖ అన్ని పరికరాలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు.

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



నరసరావుపేట. నవంబర్ 02రాజధాని వాయిస్ :పల్నాడు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ ఏర్పాట్లపై సోమవారం అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె పలు కీలక సూచనలు చేశారు.కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేయాలని, చెల్లుబాటయ్యే, కాని ఓట్లను నిబంధనల ప్రకారం జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు, ఏజెంట్లను నిబంధనల మేరకే అనుమతించాలని, లెక్కింపు ప్రక్రియ నిరంతరాయంగా సాగేలా సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. హాలు వెలుపల ఆహారం, తాగునీరు ఏర్పాటు చేయాలని, రౌండ్లు, వార్డుల వారీగా బ్యాలెట్ బాక్సులను క్రమబద్ధంగా వేరు చేయాలని సూచించారు. సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని, కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను పూర్తిగా నిషేధించి భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంతరాలు లేకుండా ఫలితాలు వెలువడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మురసు తుఫాన్ ముప్పు ఏపీసీపీడీసీఎల్ సర్వసన్నద్ధం



విజయవాడ. నవంబర్ 2రాజధాని వాయిస్ :పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సరఫరా వ్యవస్థ సన్నద్ధతపై ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి అన్ని జిల్లాల విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, బలమైన గాలుల వల్ల విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు సిబ్బంది, వాహనాలు, సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ఉద్యోగులెవరూ సెలవులు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అన్ని సర్కిల్, డివిజన్లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాలను తాకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలు, ప్రమాదాలపై టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా కంట్రోల్ రూమ్ నంబర్లు కృష్ణ (6281709355), ఎన్టీఆర్ (9440817561), బాపట్ల (9281413774), గుంటూరు (9440817526), ప్రకాశం (9440817491), పల్నాడు (7661019447) లను సంప్రదించాలని సీఎండీ పి. పుల్లారెడ్డి కోరారు.

నక్కపల్లిలో హోంమంత్రి అనిత సుడిగాలి ప్రచారం

సీతంపాలెం దత్తతకు హామీ



నక్కపల్లి.నవంబర్ 2రాజధాని వాయిస్ :నక్కపల్లి మండలంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్థానిక ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సీతంపాలెం, రేబాక, ఎన్. నర్సాపురం గ్రామాల్లో పర్యటించి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీతంపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు తనను 47 వేల మెజార్టీతో గెలిపించారని గుర్తుచేస్తూ, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చామని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.మండలంలోని రేబాక గ్రామంలో హోంమంత్రికి గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. జడ్పీటీసీ అభ్యర్థిగా గంట్యాడ రమేష్‌కు అవకాశం కల్పించడం పట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ, రేబాక ప్రజలు కల్మషం లేని మనసున్నవారని కొనియాడారు. జడ్పీటీసీ అభ్యర్థి గంట్యాడ రమేష్ ప్రజలకు తలలో నాలుకలా ఉంటూ ఎప్పుడూ సేవ చేసే నాయకుడని, అలాంటి వ్యక్తిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో పదవుల కంటే ప్రజలకు సేవ చేసే దృక్పథమే ముఖ్యమని, ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే గ్రామాల సర్వముఖ అభివృద్ధి సాధ్యమవుతుందని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com